క్లుప్తంగా

'స్పందన'కు 20 అర్జీలు

సీతమ్మధార: సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 20 అర్జీలు అందాయి. ప్రజల నుంచి వాటిని తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ పేర్ల శ్యామ్‌ప్రసాద్ స్వీకరించి పరిశీలించారు. కుల, ఆదాయ, నివాస, కుటుంబ సభ్యత్వ ధ్రువీకరణ పత్రాల కోసం పలువురు దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చేతన్, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణ సేవా సంఘం జేఏసీ ఇన్‌చార్జిగా కృష్ణ



మల్కాపురం: పారిశ్రామిక ప్రాంత నాయీ బ్రాహ్మణ సేవా సంఘం జేఏసీ(ఏడు వార్డుల పరిధి) ఇన్‌చార్జిగా సురవరపు కృష్ణను కమిటీ ప్రతినిధులు, సభ్యులు సోమవారం నియమించారు. ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలను అర్హులైన నాయీ బ్రాహ్మణులకు అందేటట్టు తన వంతు కృషి చేస్తానని కృష్ణ ఈ సందర్భంగా తెలిపారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు అందజేస్తున్న సొసైటీ సభ్యులు

కంచరపాలెం: మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా జ్యోతిర్మయి సొసైటీ అండ్ ఓల్డేజ్ హోమ్ ఆధ్వర్యంలో సోమవారం సేవా కార్యక్రమం నిర్వహించారు. కంచరపాలెం ఫ్లైఓవర్ వంతెన రహదారిలో పేదలు, అనాథలకు దుప్పట్లు పంపిణీ చేశారు. సొసైటీ చైర్‌పర్సన్ జి.లక్ష్మి మాట్లాడుతూ గాంధీజీ అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలన్నారు. దాత పుష్పలత చేతుల మీదుగా జ్ఞానాపురం, కంచరపాలెం తాటిచెట్లపాలెం, రైల్వే న్యూకాలనీ తదితర ప్రాంతాల్లో సుమారు 300 మందికి దుప్పట్లు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో శేషమణి, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

41వ వార్డులో జెడ్సీ పర్యటన



వార్డులో సమస్యలను జెడ్సీ కృష్ణకు వివరిస్తున్న కార్పొరేటర్ పూర్ణిమ

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురంలోని పలు ప్రాంతాల్లో జోన్–5 కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా వార్డులోని పలు సమస్యలను కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ జెడ్సీ దృష్టికి వెళ్లారు. వార్డు పరిధి జేఎస్ఎన్‌యూఆర్ఎం కాలనీ, బాబు కాలనీ, సెబాస్టియన్ కాలనీ, స్లీప్‌పుర్గు వీధి తదితర ప్రాంతాల్లో వారు పర్యటించారు. పారిశుద్ధ్య సమస్యలు, విద్యుత్ దీపాలు, కుక్కల బెడద, దోమల సమస్యలను జోనల్ కమిషనర్‌కు వివరించారు. అభివృద్ధి పనులపై సత్వరమే స్పందించాలని ఇంజినీరింగ్, ప్రజారోగ్య శాఖ అధికారులను జెడ్సీ ఆదేశించారు. అక్రమ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలని టౌన్‌ప్లానింగ్ ఏసీపీ ఐ.వి.రమణమూర్తి ఆదేశించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ వర్క్స్ ఈఈ శ్రీనివాసరావు, డీఈ భరణికుమార్, ఏపీడీ పద్మావతి, సీవో గణేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలిసిన కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 0608100 11006681 టౌన్ కొత్తరోడ్డు బ్రాంచి, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహించనున్నారు. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు.

మహాత్మా గాంధీకి మనసారా నివాళి

వాడవాడలా జాతిపిత వర్ధంతి కార్యక్రమాలు



ఆళ్వార్ దాస్ కళాశాలలో గాంధీజీ చిత్ర ప్రదర్శనను తిలకిస్తున్న ఎమ్మెల్యే గణబాబు



గోపాలపట్నంలో జాతిపితకు నివాళులర్పిస్తున్న బెహరా భాస్కరరావు తదితరులు



శాంతినగర్‌లో గాంధీజీకి నివాళులర్పిస్తున్న జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్

గోపాలపట్నం: నియోజకవర్గంలో సోమవారం మహాత్మా గాంధీ వర్ధంతి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. జాతిపిత చిత్రపటాలు, విగ్రహాలకు నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు. జీవీఎంసీ 52వ వార్డు శాంతినగర్‌లోని తన ఇంటి వద్ద గాంధీజీ చిత్రపటానికి డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పూలమాల వేసి నివాళులర్పించారు. గాంధీజీ మార్గం అనుసరణీయమని పేర్కొన్నారు.

- జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు తన ఇంటి వద్ద జాతిపిత గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గుణిశెట్టి శ్రీనివాసరావు, గేదెల మురళీకృష్ణ, గోపి, నాగూర్ తదితరులు పాల్గొన్నారు.
- గోపాలపట్నం ఆళ్వార్ దాస్ కళాశాలలో సింహాచలం యోగా విజ్ఞాన సమితి ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ చిత్ర ప్రదర్శన నిర్వహించారు. దీనిని ఎమ్మెల్యే గణబాబు ప్రారంభించారు. అనంతరం యోగా విజ్ఞాన సమితి వ్యవస్థాపకుడు బి.బి.రాజేంద్రప్రసాద్ కుష్ఠు వ్యాధిగ్రస్తులకు దుప్పట్లు, పండ్లు అందించారు. కార్యక్రమంలో కళాశాల అధికారులు, అధ్యాపకులు, సమితి సభ్యులు పాల్గొన్నారు.

ఆర్టీఏ కార్యాలయంలో..

మాధవధార రవాణా శాఖ కార్యాలయంలో మహాత్మా గాంధీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. గాంధీజీ చిత్రపటానికి ఉప రవాణా కమిషనర్ రాజారత్నం పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఆర్టీవోలు జె.రామ్‌కుమార్, గోపాలరావు, వాహన తనిఖీ అధికారి గణేష్ రెడ్డి, సిబ్బంది ఐ.రఘు, విమల, కరుణాకర్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గాంధీ ఆశయాలు యువతకు ఆదర్శం

మల్కాపురం: జాతిపిత గాంధీజీ ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని ట్రేడ్ యూనియన్ నాయకుడు దేవర అప్పలరాజు యాదవ్ అన్నారు. 60వ వార్డు గుల్లలపాలెంలోని మహాత్మా గాంధీ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ శాంతి, అహింస, సత్యం అనే మార్గాలను గాంధీ పాటించి ప్రపంచానికే ఆదర్శమూర్తిగా నిలిచాడన్నారు. కార్యక్రమంలో ట్రేడ్ యూనియన్ నాయకులు కోన అప్పలరాజు యాదవ్, నరేంద్ర, వెంకటరెడ్డి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



గుల్లలపాలెంలో గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



ఆర్టీఏ కార్యాలయంలో గాంధీజీకి నివాళులర్పిస్తున్న డీటీసీ రాజారత్నం, అధికారులు

ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం

సింథియా: గాంధీజీ ఆశయాలు ప్రతి ఒక్కరిలోనూ స్ఫూర్తి నింపుతాయని 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు అన్నారు. వార్డులోని ఏకేసీ కాలనీలో గాంధీజీ విగ్రహానికి ఆయన కార్యకర్తలందరితో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ కులం, మతం, పార్టీలు చూడకుండా గాంధీజీ అడుగుజాడల్లో నడుస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనకు ప్రజలందరూ సహకరిస్తూ రాష్ట్రాన్ని ముందుకు తీసుకువెళ్లాలన్నారు. కార్యక్రమంలో దండి శ్యామ్, అన్నేపు సూరి, జేసీబీ శ్రీను, మైలవరపు సురేష్, గొంతున శ్రీను, రామనాయుడు, పైలశివ, కోటి రాము, ఇతర నాయకులు పాల్గొన్నారు.



40వ వార్డులో గాంధీజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు

నేడు 58వ వార్డులో ఆడారి ఆనంద్ పర్యటన

మల్కాపురం: వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త, విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ మంగళవారం 58వ వార్డులో పర్యటించనున్నారు. పిలకవానిపాలెంలో స్మార్ట్ సిటీ నిధులతో అభివృద్ధి పనులకు, ములగాడలో పాఠశాల అభివృద్ధి పనులకు, ఉప్పర కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణానికి, ములగాడ, పిలకవానిపాలెం తదితర ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులు, సామాజిక భవనం ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో ఆయన పాల్గొని శంకుస్థాపన చేస్తారు. కార్యక్రమంలో భాగంగా ఆయా ప్రాంతాల్లో స్థానికుల సమస్యలను తెలుసుకుని, వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోనున్నారు. వార్డు కార్పొరేటర్ గులిగిందిల లావణ్య ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమాల్లో జీవీఎంసీ పలు విభాగాల అధికారులు, ఆయా ప్రాంతాల సచివాలయాల అధికారులు పాల్గొంటారు.

ఏయూ సంగీత విభాగంలో 3, 4 తేదీల్లో సదస్సు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం సంగీత విభాగంలో వచ్చే నెల 3, 4 తేదీలలో సంగీత దర్శకులు, గాయకులు సాలూరి రాజేశ్వరరావు, ఘంటశాల వెంకటేశ్వరరావులపై రెండు రోజుల వర్క్‌షాప్ నిర్వహించనున్నట్టు విభాగాధిపతి ఆచార్య ఎ.అనూరాధ తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ సదస్సు జరుగుతుందన్నారు. ఘంటశాల, సాలూరి స్వరపరిచిన సంగీతంపై అతిథులు ప్రసంగాలు ఉంటాయని చెప్పారు. ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన ఈ ఇద్దరు సంగీత దర్శకులను స్మరించుకుంటూ భవిష్యత్ తరానికి వారి సంగీత మాధుర్యాన్ని అందించడం సదస్సు ప్రధాన ఉద్దేశమన్నారు. విజయనగరం మహారాజ సంగీత కళాశాల విశ్రాంత అధ్యాపకుడు బి.ఎ.నారాయణ తన అనుభవాలను పంచుకుంటారన్నారు.

అధ్వాన రహదారితో అవస్థలు



ములగాడ విలేజ్ రహదారి దుస్థితి



పిక్క తేలిన ములగాడకు వెళ్లే మార్గం

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు ములగాడ విలేజ్ నుంచి శ్రావణ్ షిప్పింగ్ సంస్థకు వెళ్లే రహదారి శిథిలావస్థకు చేరింది. శ్రావణ్ షిప్పింగ్‌కు సంబంధించిన పలు భారీ వాహనాలు, ఆ సంస్థలో పనిచేస్తున్న కార్మికులు నిత్యం ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటారు. ములగాడ, ఎదురవానిపాలెం తదితర ప్రాంతాలవాసులు షీలానగర్ లేదా నగరానికి ఇటువైపు నుంచే వెళ్తుంటారు. ఇక్కడ సీసీ రోడ్డు నిర్మించి పదేళ్లు దాటింది. దీంతో ఈ రహదారి మొత్తం గుంతలు నిండి, పిక్క తేలి అధ్వానంగా తయారైంది. దీనికి తోడు ఈ మార్గంలో భారీ వాహనాలు ప్రయాణించే సమయంలో మబ్బులు కమ్మినట్లు ధూళి పైకి లేస్తుంది. దీంతో ఇటువైపు రాకపోకలు సాగించే వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. ఎగసి పడుతున్న ధూళి వల్ల పాదచారులు, ఈ మార్గానికి సమీపాన గల ములగాడ విలేజ్ ప్రాంత వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత అధికారులు పరిశీలించి ఈ రోడ్డును ఆధునికీకరించాలని స్థానికులు, వాహన చోదకులు కోరుతున్నారు.

ఎన్‌ఏడీ శివాలయానికి నూతన సొబగులు

- నేటి నుంచి పూజలు, హోమాలు
- రేపు ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ట



సిద్ధం చేస్తున్న యాగశాల



ధ్వజస్తంభ ప్రతిష్టకు ముస్తాబవుతున్న ఎన్‌ఏడీ శివాలయం

గోపాలపట్నం: ఎన్‌ఏడీ పరిసర ప్రాంతాల్లో తొలి శివాలయమైన ప్రథమ ఉమా విశ్వేశ్వర కుమార స్వామి దేవాలయం నూతన సొబగులు అద్దుకుంటోంది. ఈ ఆలయంలో బుధవారం ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన జరగనుంది. ఈ నేపథ్యంలో ఆలయాన్ని ప్రత్యేకంగా ముస్తాబు చేస్తున్నారు. యాగశాలను రూపొందిస్తున్నారు. మంగళవారం నుంచి ఇక్కడ విశేష పూజలు, హోమాలు నిర్వహించనున్నారు. ఎన్‌ఏడీ విస్తరణలో భాగంగా ఆలయ ప్రాంగణాన్ని కుదించేశారు.

ఆక్రమంలో కొంత కాలం కిందట ధ్వజ స్తంభం పడిపోయింది. ఆ తరువాత ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపడుతున్న కారణంగా ధ్వజ స్తంభం ఏర్పాటులో జాప్యం ఏర్పడింది. నూతన ఆలయ అభివృద్ధి కమిటీ ఏర్పడ్డాక ధ్వజస్తంభం ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు.

ధ్వజస్తంభం కోసం అన్వేషణ

ధ్వజస్తంభం ఏర్పాటుకు ఆలోచన రాగానే శాస్త్రోక్తంగా వాడాల్సిన సొమిధి వృక్షం కోసం అన్వేషణ చేశారు. సుదూర ప్రాంతం నుంచి ఆ చెట్టును వ్యయ ప్రయాసలతో తీసుకొచ్చారు. దీన్ని ప్రతిష్ఠాపనకు అనుకూలంగా మార్చారు.

దాతల సాయం అవసరం



ధ్వజస్తంభంపై ఇత్తడి తాపడం వేసేందుకు దాతల సాయం కావాల్సి ఉంది. ఈ మహా కార్యక్రమానికి దాతలు సహకరించి సాయం అందించాలి. ప్రతిష్ఠాపన కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి కృపకు పాత్రులు కావాలి.

– గొంతిన రామకృష్ణ, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్

ఆర్‌ఎంపీ యూనియన్ జోనల్ కమిటీ ఎన్నిక



ప్రతిజ్ఞ చేస్తున్న కొత్త కమిటీ సభ్యులు

గోపాలపట్నం: రూరల్ మెడికల్ ప్రాక్టీషనర్ యూనియన్ జోనల్ కమిటీ ఎన్నిక స్థానిక కుమారి కల్యాణ మండపంలో సోమవారం జరిగింది. జోనల్ కమిటీ అధ్యక్షుడిగా జంగం జోషి, గౌరవ అధ్యక్షుడిగా మమ్ముల తిరుపతిరావు, ఉపాధ్యక్షులుగా విజయనగరానికి చెందిన అల్లాడ త్రినాథరావు, అనకాపల్లికి చెందిన అలక రాజు, గాజువాకకు చెందిన ఏలేటి రోజా, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ ఎస్.సుగుణేశ్వరి, సహాయ కార్యదర్శిగా లోగిస గణేష్, వీరితోపాటు 9 మంది కార్యవర్గ సభ్యులు, ఈసీ మెంబర్లు, కో కన్వీనర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరి చేత ప్రమాణ స్వీకారం, ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో బెహరా ఆస్పత్రి ఎండీ బెహరా రవితేజ, లోక్‌సత్తా పార్టీ నాయకుడు విశెట్టి బాబ్జి, ఫెంపా రాష్ట్ర సలహాదారుడు డాక్టర్ ఎస్ఎల్ రావు, సంఘం న్యాయ సలహాదారులు కె.పి.దేశాయ్, ముఖ్య సలహాదారుడు మమ్ముల తిరుపతిరావు, అమృత ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ కోన ప్రకాశరావు, వి డెంటల్ కేర్ ఎండీ కె.ఎం.కె.రమేష్ పాల్గొన్నారు.

గవర్నర్ దత్తాత్రేయకు వీడ్కోలు



హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయకు వీడ్కోలు పలుకుతున్న బీజేపీ నాయకులు

గోపాలపట్నం: హర్యానా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయకు విశాఖ విమానాశ్రయంలో బీజేపీ నాయకులు సాదరంగా వీడ్కోలు పలికారు. విశాఖలో రెండు రోజుల పర్యటనను ముగించుకుని సోమవారం ఆయన ఢిల్లీకి తిరుగు ప్రయాణమయ్యారు. వీడ్కోలు పలికిన వారిలో రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు, నాయకులు సాగి కాశీవిశ్వనాథ రాజు, కరణంరెడ్డి నర్సింగరావు, కె.సుబ్రహ్మణ్యం, ఉమ్మడి సుజాత, మురళీమోహన్‌రాజు తదితరులు ఉన్నారు.

సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి

మర్రిపాలెం: సేంద్రీయ వ్యవసాయాన్ని, రైతులను ప్రోత్సహించాలని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. మురళీనగర్ మసీదు దరి బీజేపీ యువ మోర్చా అధ్యక్షుడు, జాతీయ ఎగ్జిక్యూటివ్ మెంబర్ వంశీ యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ కలయిక, అల్పాహార విందు కార్యక్రమానికి ఆయన అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతోమంది మేధావులు ఉన్న భారతదేశంలో ప్రధాని నరేంద్ర మోదీ ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ అనే నినాదంతో భారతదేశాన్ని గొప్ప దేశంగా నిర్మించాలనే లక్ష్యంతో పని చేస్తున్నారని కొనియాడారు. అలాగే విద్యతోనే సమాజంలో మంచి గుర్తింపు వస్తుందని, ప్రతి ఒక్కరూ విద్యావంతులు కావాలని సూచించారు. మహిళలను గౌరవిస్తే దేశం, రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందన్నారు. తాను వివిధ హోదాల్లో ఉమ్మడి రాష్ట్రాల్లో పనిచేశానని, రెండు రాష్ట్రాలు విడిపోవడం బాధ కలిగించినప్పటికి రాష్ట్రాలు రెండూ కలిసికట్టుగా ఉండడం ఆనందాన్ని కలిగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు, ఎమ్మెల్సీ మాధవ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్ర, బీజేపీ నాయకుడు అప్పలకొండ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గవర్నర్ బండారు దత్తాత్రేయ

ఇంటర్న్‌షిప్‌పై అధ్యాపకులకు శిక్షణ

మద్దిలపాలెం: ఇంటర్న్‌షిప్, అప్రెంటిస్‌షిప్ మేనేజ్‌మెంట్, లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టంపై నాలుగో బ్యాచ్ శిక్షణ కార్యక్రమం సోమవారం నోడల్ రిసోర్స్ సెంటర్ అయిన కృష్ణా కళాశాలలో ప్రారంభమైంది. ఈ శిక్షణ వచ్చేనెల ఒకటో తేదీ వరకూ ఉంటుందని నోడల్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు తెలిపారు. విద్యార్థుల్లోని నైపుణ్యానికి పదును పెట్టి వారిలో ఉపాధికి దోహదపడే వృత్తులపై అవగాహన కల్పించాలని సూచించారు. ఇంటర్న్‌షిప్, అప్రెంటిస్‌కు దోహదపడే అంశాలను విద్యార్థులకు వివరించాలన్నారు. శిక్షణ కో–ఆర్డినేటర్ డాక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ నైపుణ్యంతో విద్యార్థుల ఉజ్వల భవితకు దిశానిర్దేశం చేయడమే లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి.జయ, ట్రైనర్లు శ్రీనివాస్, ప్రసాద్, విద్యాసాగర్, సిహెచ్.లలిత, కె.రవిబాబు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ విజయబాబు

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో ఉదయం 9.30గంటల నుంచి కల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై వేంజేపచేశారు.

విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అందజేశారు.

జాతి నిర్మాణమే యువత ధ్యేయం



మాట్లాడుతున్న ఎన్ఎస్ఎస్ జిల్లా అధికారి భాగ్యలక్ష్మి



ట్రైబల్ యూత్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమంలో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ అధికారులు, వలంటీర్లు

మల్కాపురం: విభిన్న మతాలు, కులాలు, వర్గాలు, వర్ణాలు, ప్రాంతాలు, భాషలకు నిలయమైన భారత దేశంలో ఐక్యతను నింపి జాతిని నిర్మించడమే యువత ధ్యేయం కావాలని జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి పిలుపునిచ్చారు. నెహ్రూ యువకేంద్ర సంఘటన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానికంగా 14వ నేషనల్ ట్రైబల్ యూత్ ఎక్స్ఛేంజ్ పేరిట కార్యక్రమం నిర్వహించారు. అతిథిగా ఆమె దేశభక్తి–జాతి నిర్మాణం అనే అంశంపై ప్రసంగించారు. యువతకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగాం అధికారులు, వలంటీర్లు పాల్గొన్నారు.

పందుల నిర్మూలనకు ప్రత్యేక డ్రైవ్



పందులను తరలిస్తున్న సిటీ వెటర్నరీ సిబ్బంది

డాబాగార్డెన్స్: నగర పరిశుభ్రతకు విఘాతం కలిగిస్తున్న పందుల నిర్మూలనకు జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు ఆదేశాల మేరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. నగరంలో భారీ స్థాయిలో పందుల కాల్చివేతతోపాటు నగరం నుంచి తరలింపు కార్యక్రమం చేపట్టినట్టు సిటీ వెటర్నరీ అధికారి డాక్టర్ కిషోర్ తెలిపారు. పెంపకందారులను పలుమార్లు హెచ్చరించినప్పటికీ వారిలో ఎటువంటి మార్పు కనిపించడం లేదని, అందుకు కఠిన చర్యలు చేపట్టామన్నారు. గాజువాక, జ్ఞానాపురం, మధురవాడ తదితర ప్రాంతాల్లో ఆర్మ్ రిజర్వ్‌డ్ పోలీసుల సహకారంతో పులివెందుల జంగారెడ్డిగూడెం నుంచి వచ్చిన 8 బృందాల ద్వారా సుమారు 621 వరకు పందులను పట్టుకుని ఇతర రాష్ట్రాలకు తరలించామని చెప్పారు. మరో 252 పందులను కాల్చి చంపామన్నారు. జీ–20 సదస్సు మార్చి నెలలో జరుగుతున్న దృష్ట్యా నగరం నుంచి పందులు పూర్తిగా నిర్మూలిస్తామని, కొంత మంది పెంపకందారులు ఇప్పటికే పందులను బయటకు తరలిస్తున్నారని వివరించారు. విధులకు ఆటంకం కలిగిస్తే పెంపకందారులపై చర్యలు తీసుకుంటామని డాక్టర్ కిషోర్ హెచ్చరించారు.

18న అంతర్జాతీయ సంగీత ప్రదర్శన



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏజ్ కేర్ ఫౌండేషన్ ప్రతినిధి సాంబశివరావు, జిజా వల్సరాజ్, సుగంధి తదితరులు

బీచ్ రోడ్డు: క్యాన్సర్ రోగులకు నిధుల సేకరణలో భాగంగా వచ్చేనెల 18న అంతర్జాతీయ సంగీత ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు రోహిత్ మెమోరియల్ ట్రస్ట్ ప్రతినిధి మీనాక్షి తెలిపారు. సోమవారం నగరంలోని ఒక హోటల్‌లో ప్రదర్శన పోస్టర్‌ను ఏజ్ కేర్ ఫౌండేషన్ ప్రతినిధి సాంబశివరావు, వీసీసీఐ ఉమెన్స్ వింగ్ అధ్యక్షుడు జిజా వల్సరాజ్, ఏఎస్ రాజా బ్లడ్ బ్యాంక్ మెడికల్ డైరెక్టర్ సుగంధి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మీనాక్షి మాట్లాడుతూ ఏడుగురు సంగీతకారులు, నృత్యాకారులతో కూడిన అంతర్జాతీయ బృందంతో ఈ ప్రదర్శన ఏర్పాటు చేశామన్నారు. ఈ ప్రదర్శన ద్వారా వచ్చిన విరాళాలను దేశ వ్యాప్తంగా క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. పూర్తి వివరాల కోసం 93486 23225, 99496 27222 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని ఆమె కోరారు.